

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 17-06-2025 | సంపుటి - 24 | సంచిక - 46 రూ : 4 | పేజీలు: 8


## రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త!

* రేపటి నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ
* మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి
* సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని మంత్రులకు సూచన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు శుభవార్తను అందించింది. రేపటి నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయనుంది. ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూడా ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లా నేతలతో ఇన్‌ఛార్జ్ మంత్రులు సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు.

*** వైద్య కళాశాలలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న 34 వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్రంలోని 26 వైద్య కళాశాలల్లో ఉన్న సౌకర్యాలపై జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ)

తరువాయి 2లో






## దేశంలో ఇలాంటి ప్రదేశం మరెక్కడా లేదు: సీఎం చంద్రబాబు

**విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష**

- ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు యోగాకు అద్భుత ప్రదేశం అని వెల్లడి
- దేశంలోనే విశాఖ తీరం ప్రత్యేకమని ముఖ్యమంత్రి వ్యాఖ్య
- 5 లక్షల మందితో యోగా.. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యం
- యోగాను ప్రజా ఉద్యమంగా మార్చాలని చంద్రబాబు పిలుపు
- జూన్ 21న కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న 'యోగాంధ్ర' కార్యక్రమంపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. విశాఖలో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు ఉన్న సువిశాల తీర ప్రాంతం అత్యంత అనువైందని, దేశంలో మరెక్కడా ఇటువంటి ప్రదేశం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సోమవారం విశాఖకు విచ్చేసిన ఆయన, ఆర్కే బీచ్ నుంచి రుషికొండ సమీపంలోని గీతం విశ్వవిద్యాలయం వరకు

తరువాయి 2లో

## ఐసీసీ వరల్డ్ కప్ మ్యాచ్‌లకు వైజాగ్ ఆతిథ్యమిస్తోందని గర్వంగా ప్రకటిస్తున్నాం

**2025 ఐసీసీ మహిళల ప్రపంచకప్‌నకు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం**

* విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ
* రాష్ట్ర క్రికెట్ ప్రస్థానంలో ఇది ఒక మైలురాయిగా అభివర్ణన
* యువత, ముఖ్యంగా బాలికలకు ఈ ఈవెంట్ గొప్ప స్ఫూర్తిదాయకం
* ప్రపంచ క్రికెట్‌లో ఏపీ కేంద్ర స్థానంలో నిలవడం పట్ల మంత్రి లోకేశ్ హర్షం
* భారత జట్టుకు మద్దతుగా స్టేడియాలు నింపాలని పిలుపు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ క్రీడా కార్యక్రమానికి వేదిక కానుంది. భారత్ లో ఈ ఏడాది జరగనున్న ఐసీసీ మహిళల ప్రపంచకప్ క్రికెట్ పోటీలకు రాష్ట్రం ఆతిథ్యమివ్వనుందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం ప్రకటించారు. ఈ అంతర్జాతీయ

తరువాయి 2లో



2లో

## ప్రధాని నరేంద్ర మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం

* భారతీయులందరికీ దక్కిన గౌరవమన్న ప్రధానమంత్రి
* ఇరుదేశాల మైత్రికి ఈ పురస్కారం అంకితమని వ్యాఖ్య
* భారత్-సైప్రస్ బంధం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం
* రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని పర్యటన




## అమెరికాలో ... కాల్పుల కలకలం.... ముగ్గురి మృతి

2లో



## రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త!

(మొదటిపేజీ తరువాయి)

అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రంలోని పలు మెడికల్ కళాశాలల్లో సదుపాయాల కొరత ఉందని గుర్తించిన జాతీయ వైద్య మండలి, ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లను ఈ నెల 18న ఢిల్లీకి రావాలని ఆదేశించింది. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ కూడా వర్చువల్ విధానంలో ఈ సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసి, నివేదిక సమర్పించడానికి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఆయా కళాశాలల్లో అవసరమైన అన్ని వసతులను రాబోయే మూడేళ్లలో సమకూర్చాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, అనుమతుల వివరాలను తనకు అందజేస్తే, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో మాట్లాడి వాటిని త్వరితగతిన మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానని రేవంత్ రెడ్డి అధికారులకు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ భాషను ఒక ఆప్షనల్ సబ్జెక్టుగా నేర్పించాలి. జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి మంచి డిమాండ్ ఉంది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. వైద్య, విద్య శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రతి నెలా మూడో వారంలో తప్పనిసరిగా సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## ప్రధాని నరేంద్ర మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం సైప్రస్ దేశంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3'ను ప్రధాని మోదీ అందుకున్నారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రధాని మోదీకి అందజేశారు. ఈ గౌరవం 140 కోట్ల మంది భారతీయులకు దక్కిందని, ఇది ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సాంస్కృతిక సంబంధాలకు, సోదరభావానికి, వసుధైక కుటుంబం అనే భావనకు నిదర్శనమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ పురస్కారాన్ని అందుకున్న అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, సైప్రస్ ప్రభుత్వానికి, అక్కడి ప్రజలకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును భారత్‌సైప్రస్ దేశాల మధ్య ఉన్న చిరకాల స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ గుర్తింపు ఇరు దేశాల శాంతి, భద్రతలు, సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రత, శ్రేయస్సు వంటి అంశాలపై పరస్పర నిబద్ధతను మరింతగా పటిష్టం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో భారత్‌సైప్రస్ మధ్య క్రియాశీల భాగస్వామ్యం సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. రెండు దేశాలు తమ పురోగతిని బలోపేతం చేసుకోవడమే కాకుండా, ప్రపంచంలో సురక్షితమైన, శాంతియుత వాతావరణాన్ని నిర్మించడానికి కూడా తమ వంతు సహకారం అందిస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా సైప్రస్ చేరుకున్నారు. లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదరంగా స్వాగతం పలికారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటన భారత్, సైప్రస్ సంబంధాలలో ముఖ్యమైన ప్రగతికి దోహదం చేస్తుందని, ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడుల రంగాలలో కలిసి పనిచేసే అవకాశాలు మరింతగా పెరుగుతాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. సైప్రస్ పర్యటన ముగించుకున్న అనంతరం, ప్రధాని మోదీ కెనడాకు వెళతారు. అక్కడ జీ7 సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఆ తర్వాత క్రొయేషియాకు వెళ్లనున్నారు.

## అమెరికాలో ... కాల్పుల కలకలం.... ముగ్గురి మృతి



అగ్రరాజ్యం అమెరికాలో మరోమారు నెత్తురోడింది. ఉన్మాదుల తుపాకుల తూటాలకు అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తాజాగా, ఉటా రాష్ట్రంలో జరిగిన ఓ పండుగలో చెలరేగిన కాల్పుల బీభత్సం, పసికం దుతో సహా ముగ్గురిని బలిగొంది. ఈ దారుణ ఘటనతో యావత్ అమెరికా ఉలిక్కిపడింది, తుపాకీ సంస్కృతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, ఉటా రాష్ట్రంలోని వెస్ట్ వ్యాలీ సిటీలో గల సెంటెనియల్ పార్క్‌లో ఆదివారం రాత్రి 'వెస్ట్‌ఫెస్ట్' పేరిట జరుగుతున్న వార్షిక కార్నివాల్ ఆనందోత్సాహాల మధ్య ఈ విషాదం చోటుచేసుకుంది. కార్నివాల్ రైడ్‌ల సమీపంలో ఈ ఘాతుకం జరిగినట్లు తెలుస్తోంది. వెస్ట్ వ్యాలీ సిటీ పోలీసులు ఈ ఘటనను ధృవీకరిస్తూ, తమ అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ప్రాథమిక సమాచారాన్ని వెల్లడించారు. "సెంటెనియల్ పార్క్‌లో జరుగుతున్న వెస్ట్‌ఫెస్ట్‌లో కాల్పులు జరిగాయి. పలువురు బాధితులు ఉన్నారు" అని పోలీసులు తమ పోస్టులో పేర్కొన్నారు.

## దేశంలో ఇలాంటి ప్రదేశం మరెక్కడా లేదు: సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను కూడా తనిఖీ చేశారు. ఈ పర్యటన అనంతరం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ నిర్వహణకు చేపడుతున్న చర్యలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన సూచనలు, సలహాలను ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి స్వీకరించారు. ప్రపంచ రికార్డు నెలకొల్పేలా యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

*** యోగా డే డిక్లరేషన్ చేద్దాం**

సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒక డిక్లరేషన్ గా తీసుకుందాం. యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో అంతర్భాగంగా మార్చేందుకు కృషి చేద్దాం. విశాఖలో ఒక చారిత్రక ఘట్టానికి నాంది పలుకుతున్నాం, అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 కోట్ల మంది ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం 5 లక్షల మందితో యోగా చేసేందుకు వేదిక కానుందని, ఈ కార్యక్రమంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

**యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి**

యోగా దినోత్సవ నిర్వహణలో భాగంగా భారతీయ నౌకాదళం కూడా ఆర్కే బీచ్ సమీపంలో 11 నౌకలతో ప్రదర్శన ఏర్పాటు చేయనుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అధికారులకు సూచనలిస్తూ, "శిక్షణ పొందిన వారే యోగా దినోత్సవంలో పాల్గొంటారు. యోగాను ఒక ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. ప్రధాని మోదీకి ఇచ్చిన మాట ప్రకారం యోగా నిర్వహణకు ప్రణాళిక రూపొందించాం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరి. అందరం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం" అని పిలుపునిచ్చారు. 607 వార్డు సచివాలయాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, 326 కంపార్ట్‌మెంట్లలో యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. పార్కింగ్, మరుగుదొడ్ల వంటి సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి అవసరమైన అన్ని వివరాలను ముందుగానే తెలియజేయాలని, వారు కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళ్లేంత వరకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

*** పసుపు నీళ్లలో చొక్కాలు ముంచి ఇచ్చాం!**

సమీక్ష సందర్భంగా 1987లో జరిగిన మహానాడును ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. సరైన వసతులు లేని రోజుల్లో కూడా కళా వెంకట్రావు వంటి నేతల సహకారంతో మహానాడును అద్భుతంగా నిర్వహించామని, ఎంతమంది వస్తారు, ఎంత దూరం నడుస్తారనేది కూడా ముందే అంచనా వేశామని తెలిపారు. హాజరయ్యేవారంతా పసుపు చొక్కాలు ధరించి రావాలని సూచించామని, అలా రానివారి చొక్కాలను పసుపు నీళ్లలో ముంచి ఇచ్చామని నాటి సంఘటనలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నందున ఇలాంటి కార్యక్రమాలను మరింత విజయవంతంగా నిర్వహించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఐసీసీ వరల్డ్ కప్ మ్యాచ్ లకు వైజాగ్ ఆతిథ్యమిస్తోందని గర్వంగా ప్రకటిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

టోర్నమెంట్‌లోని కొన్ని మ్యాచ్‌లు విశాఖపట్నంలోని ప్రఖ్యాత ఏసీఏవీడీసీఏ స్టేడియంలో జరుగుతాయని ఆయన వెల్లడించారు. ఈ పరిణామం రాష్ట్ర క్రీడారంగ ప్రగతిలో ఒక కీలక ఘట్టమని, యావత్ రాష్ట్రానికి గర్వకారణమని ఆయన అభివర్ణించారు. మంత్రి నారా లోకేశ్ ఈ విషయాన్ని తెలియజేస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ మహిళా క్రికెటర్లను విశాఖలోని ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన ఏసీఏవీడీసీఏ స్టేడియం స్వాగతించనుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ ప్రస్థానంలో ఇది ఒక చారిత్రాత్మక అధ్యాయమని, రాష్ట్రానికి దక్కిన గొప్ప గౌరవంగా దీనిని పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కేవలం ఒక క్రీడా కార్యక్రమంగా మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న బాలికలు పెద్ద కలలు కనడానికి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, అడ్డంకులను అధిగమించడానికి ఈ ఈవెంట్ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యువజన సాధికారత, క్రీడల పట్ల తనకు ప్రగాఢమైన ఆసక్తి ఉందని గుర్తు చేస్తూ, ప్రపంచ క్రికెట్ వేదికపై ఆంధ్రప్రదేశ్ కేంద్ర స్థానంలో నిలవడం పట్ల తాను అమితమైన సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాభిమానులందరూ




ఏకతాటిపైకి వచ్చి, స్టేడియాలను నింపి, భారత మహిళా జట్టుకు (ఉమెన్ ఇన్ బ్లూ) మద్దతు తెలిపి, విశాఖ సత్తాను ప్రపంచానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అంతర్జాతీయ పోటీల నిర్వహణ ద్వారా రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు తన ట్వీట్ లో ఐసీసీ మహిళల వరల్డ్ కప్ లో విశాఖలో జరిగే మ్యాచ్ ల షెడ్యూల్ ను కూడా పంచుకున్నారు. ఈ వేదికపై మొత్తం 5 లీగ్ మ్యాచ్ లు జరగనుండగా... వాటిలో భారత్ ఆడే రెండు మ్యాచ్ లు ఉన్నాయి. అక్టోబరు 9న దక్షిణాఫ్రికా, అక్టోబరు 12న ఆస్ట్రేలియాతో టీమిండియా మహిళల జట్టు తలపడనుంది.

## తెలంగాణకు మరో 7 కొత్త నవోదయ విద్యాలయాలు మంజూరు

*** డిసెంబర్ 2024 ఆమోదం, తాజాగా అధికారిక ఉత్తర్వులు**

*** మొత్తం నవోదయాల సంఖ్య 16కు పెరుగుదల**

*** భద్రాద్రి, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు**

*** జులై 14 నుంచి తరగతుల ప్రారంభానికి ప్రణాళిక**



తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి కొత్తగా మరో ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలను (జేఎన్‌వీ) మంజూరు చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను సోమవారం జారీ చేసింది. గత ఏడాది డిసెంబర్‌లోనే ఈ కొత్త విద్యాలయాల ఏర్పాటుకు సూత్రప్రాయంగా ఆమోదం లభించినప్పటికీ, ఇప్పుడు పరిపాలనాపరమైన అనుమతులు ఖరారయ్యాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో నాణ్యమైన విద్య మరింత మంది విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి అందుబాటులోకి రానుంది.

**కొత్త విద్యాలయాలు ఏర్పాటయ్యే జిల్లాలు**

కేంద్రం తాజాగా మంజూరు చేసిన ఏడు నవోదయ విద్యాలయాలను భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం తెలంగాణలో కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, కామారెడ్డి, వరంగల్, రంగారెడ్డి, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో కలిపి మొత్తం 9 నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఈ కొత్త వాటితో కలిపి రాష్ట్రంలో జేఎన్‌వీల సంఖ్య 16కు చేరుతుంది.

**కేబినెట్ నిర్ణయం, దేశవ్యాప్త విస్తరణ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 28 కొత్త నవోదయ విద్యాలయాలు, 85 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగానే తెలంగాణకు ఈ ఏడు విద్యాలయాలు దక్కాయి.

*** నిధుల కేటాయింపు, తరగతుల ప్రారంభం**

ఈ కొత్త విద్యాలయాల ఏర్పాటు, నిర్వహణ కోసం 202429 మధ్య కాలంలో సుమారు రూ.2,359 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇందులో భవన నిర్మాణాల వంటి మూలధన వ్యయం రూ.1,944 కోట్లు కాగా, నిర్వహణ ఖర్చు రూ.415 కోట్లుగా ఉంటుందని కేంద్రం పేర్కొంది. తెలంగాణ విద్యాశాఖ అధికారులు ఇప్పటికే నవోదయ విద్యాలయ సమితి అధికారులతో సమావేశమై కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ ఏడు కొత్త విద్యాలయాల్లో తాజా విద్యా సంవత్సరం, అంటే జులై 14 నుంచి తరగతులు ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# విద్యకు పెద్దపీట వేస్తాం : ఎమ్మెల్యే గూడెం

* **శివనగర్ లో అదనపు తరగతి గదుల శంకుస్థాపన**
* **పాల్గొన్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

జిన్నారం,ప్రజాస్పూర్తి 16 ; నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుదామని, నియోజకవర్గంలో విద్యకు పెద్దపీట వేస్తామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం జిన్నారం మండలంలోని శివానగర్ గ్రామంలో అతనపు తరగతి గదుల నిర్మాణ శంకుస్థాపన పనులను ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా, పార్టీలకతీతంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. గత 11 సంవత్సరాల నుండి పటాన్చెరువు నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతం జరిగిన అభివృద్ధి చాలదని, ఇంకా 75% అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో 50 లక్షల సిఎస్ఆర్ ఫండ్ తో అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. అడిగిన వెంటనే న్యూల్యాండ్ పరిశ్రమ వారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందించదగ్గ విషయమని ఆయన తెలిపారు. ఈ సహాయ సహకారానికి పరిశ్రమ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అతి త్వరలో పఠాన్ చెరువు పట్టణంలో 350 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించుకుంటామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గానికి పాలిటెక్నిక్ కళాశాల రావడం శుభ సూచకమని నవోదయ విద్యాలయం,



నర్సింగ్ కళాశాల కోసం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం నియోజకవర్గంలో జరిగేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చాలామంది యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు కుంచాల ప్రభాకర్, న్యూ ల్యాండ్ పరిశ్రమ యాజమాన్య సభ్యులు డివి రెడ్డి ,సిహెచ్ రవి, పంచాయతీరాజ్ ఏఈ మల్లేష్, జిన్నారం ఇంచార్జ్ ఎంఈఓ కుమారస్వామి, పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి, మాజీ సర్పంచ్లు పూజారి రాజు, సత్యనారాయణ ,మాజీ ఎంపీటీసీ ఆకుల భార్గవ్ ,నవీన్ ,ప్రతాపరెడ్డి ,కృష్ణ, నాయకులు ,పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో పిల్లలకు పండ్లు, బిస్కెట్లు అందజేత



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామం అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఢిల్లీ చంద్రకళమల్లారెడ్డి దంపతులు తమ మనవరాలి రెండవ సంవత్సరం జ్ఞాపకార్థం పండ్లు, బిస్కెట్లు, 50పలకలను అందజేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ చంద్రకళమల్లారెడ్డి దంపతులను మహిళలు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## భువనగిరి రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట, ప్రజాస్పూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం పగిడిపల్లి గ్రామ సమీపంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం రోజు ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిఆర్వో ఆదిమూలం సురేష్ కుటుంబ సభ్యుల తో కలసి ఎల్లమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.. ఆదివారం కావడంతో భక్తుల సందడి నెలకొన్నది. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వేడుకున్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తోటకూర వెంకటేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు క్యాసాగళ్ల చందు, ఆదిమూలం వీరస్వామి, దికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించిన రైతులు



ప్రజాస్పూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన, పరికరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాదు నుండి సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తన సందేశాన్ని రైతులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.




## ప్రాచీన హస్తకళలు అద్భుతం

* **మినీ క్రాఫ్ట్స్ హస్తకళల కేంద్రం సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ లు**

చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: భారతీయ ప్రాచీన హస్తకళలు అద్భుతమని ట్రైనీ ఐఏఎస్ అధికారులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం టెక్స్ టైల్ పార్కులోని మినీ క్రాఫ్స్ హస్తకళల కేంద్రాన్ని ఐదు రాష్ట్రాలకు చెందిన ట్రైనింగ్ ఐఏఎస్ అధికారులు సౌరబ్ శర్మ, సలోని చాబ్రా, హర్ష చౌదరి, కర్లాన్ చిగ్తి యాన్వి, కొయ్యడా ప్రణయ్ కుమార్ లు సోమవారం సందర్శించారు. భారతీయ ప్రాచీన హస్తకళలైన బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్ బాతిక్ ప్రింటింగ్, టై అండ్ డై పద్ధతిలో నూలు వస్త్రాలను తయారు చేసే పద్ధతిని పరిశీలించారు. తెలంగాణకు కేటాయించిన 2024 ట్రైనీ ఐఏఎస్ ల బృందం హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణలో తెలంగాణదర్శన్ లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మినీ క్రాఫ్స్ హస్తకళల కేంద్రాన్ని సందర్శించారు. పర్యావరణానికి హాని కలగకుండా నూలుతో తయారైన వస్త్రాలపై, ప్రకృతి నుంచి సేకరించిన రంగులతో తయారైన వస్త్రాలు ధరించడం వల్ల ప్రజల ఆరోగ్యానికి సైతం మేలు జరుగుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. హస్తకళల కేంద్రం వ్యవస్థాపకుడు, ఫ్యాషన్ డిజైనర్ కే కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రాచీన భారతీయ హస్తకళలకు పూర్వవైభవం తీసుకురావాలనే సంకల్పంతో టెక్స్ టైల్ పార్కులో మినీ క్రాఫ్ట్స్ పేరుతో హస్తకళల కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. మరికొంద రికి ఉపాధి కల్పిస్తున్నామని ట్రైనీ ఐఏఎస్ ల బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకురాలు పుష్పలత, మర్రి చెన్నారెడ్డి మానవ వరులు అభివృద్ధి సంస్థ నోడల్ అధికారి డాక్టర్ పెద్ద బోయిన శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, మల్కాపురం పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీ స్టేషనరీ వ్యాపారాన్ని అరికట్టాలి

* **ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్నాడంటూ ఎంఈఓ పై ఆరోపణలు**
* **మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాష్, తీగుళ్ళ శ్రీనివాస్**






చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా స్టేషనరీ వ్యాపారం చేస్తున్న ట్రినిటీ ప్రైవేటు విద్యాసంస్థ ఆగడాలను అరికట్టాలని మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాష్, తీగుళ్ళ శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ట్రినిటీ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టేషనరీ దుకాణం ఎదుట ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అక్రమంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్ స్టేషనరీ ఐటమ్స్ అమ్ముతున్నారంటూ ఆందోళన చేశారు. పాఠ్యపుస్తకాలను దుకాణం ఎదుట వేసి, అక్కడే బయట నుంచి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక విద్యాసంస్థలో చదివే విద్యార్థికి ఆ విద్యాసంస్థ తయారుచేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్ స్టేషనరీ ఐటమ్స్ కొనాలనే నిబంధనను అమలు చేస్తున్నారంటూ ఆరోపించారు. విద్యాసంస్థలు అక్రమంగా వ్యాపారం చేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలు దోచుకుంటున్నారంటూ ఆరోపించారు. పాఠశాల యాజమాన్యం మా వ్యాపారం మేము చేసుకుంటామని, మీకేం నష్టమంటూ సంఘం నాయకులను బెదిరించారని ఆరోపించారు. ఇట్టి విషయంపై మండల విద్యాధికారిని సంప్రదించామని, సంబంధిత అధికారి ట్రినిటీ పాఠశాల మా పరిధిలోకి రాదని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. చౌటుప్పల్ మండల విద్యాధికారి ప్రైవేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థలు సొంతంగా స్టేషనరీ వ్యాపారం చేస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండల విద్యాధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని, స్టేషనరీ వ్యాపారాన్ని అరికట్టాలని, లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయం జిల్లా విద్యాధికారి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి సాతిరి మనోజ్, మండల ఉపాధ్యక్షుడు దోనూరు శ్రావణ్, బండారి విక్రమ్, మండల కమిటీ సభ్యులు మణికంఠ, సందీప్, జయంత్, రాము, మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక శాఖ మంత్రి వివేక్ ని కలిసిన హెచ్ఎల్ హెఎడబ్ల్యూ యూనియన్ నాయకులు



కూకట్ పల్లి, (ప్రజాస్పూర్తి) : ఇటీవల మంత్రి గా ప్రమాణస్వీకారం చేసిన తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ని సోమవారం కూకట్ పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల భోకేను అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి వెంకటస్వామి ని ఆదర్శంగా తీసుకుని పేద ప్రజల కార్మికుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ కార్యదర్శి కే.సురేష్, జాయింట్ సెక్రటరీ డి.వెంకటపతి,పోలేపల్లి శ్రీకాంత్,ఆర్గనైసింగ్ సెక్రటరీ యస్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు స్కూళ్లల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి..

* **ఫిట్ నెస్ లేని బస్సులను నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు...**



యాదాద్రి భువనగిరి,(ప్రజాస్పూర్తి) : భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేటు స్కూళ్ళలో అధిక ఫీజులను నివారించాలని ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ యుఐ నాయకులు సురుపంగ చందు మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్ళలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పేరెంట్స్ కమిటీ సూచనల మేరకు ఫీజులను తీసుకోవాలని, పుస్తకాలను స్కూళ్ళలో విక్రయించకూడదని, ఫిట్ నెస్ లేని బస్సులను నడపవద్దని, ఎలాంటి అనుమతులు లేని స్కూళ్లను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని, తరగతులు ప్రారంభం కాకముందే 50 శాతం ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యార్థుల సంఖ్యపరంగా బోధన సిబ్బంది లేకపోవడం, విద్యార్హత లేని వారితో విద్యా బోధనలు చేస్తు విద్యార్థుల పై జరుగుతున్న ఆర్థిక దోపిడీని అరికట్టి న్యాయమైన విద్యా హక్కులను విద్యార్థులకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ నాయకులు ఎండి. అసద్ ఉన్నారు.

## పారిశుధ్య కార్మికుల శ్రమను తగ్గించడానికి మిషన్ శానిటేషన్ ప్రారంభం

ప్రజా స్పూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పరిశుభ్రత , పారిశుధ్య పనులను మరింత సులభతరం చేయడానికి జిల్లా కలెక్టర్ వినూత్నమైన మెషిన్ శానిటేషన్ ఆలోచనను అందించారు. ఈ ఆలోచనను అమలు చేయడంలో భాగంగా, వెంటనే డిఎంఎఫ్ నిధుల ద్వారా మంజూరు కల్పించి,




అవసరమైన యంత్రాలను పొందేందుకు చర్యలు తీసుకున్నారు.ఇందులో భాగంగా క్రింది యంత్రాలను హాస్పిటల్‌కు అందించారు. స్క్రబ్బింగ్ మెషిన్,మాన్యువల్ స్వీపర్,హై ప్రెషర్ వాషర్ ఈ యంత్రాలు ఇటీవల హాస్పిటల్‌కు డెలివరీ అయ్యి, వినియోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుని ప్రస్తుతం ఇవి ప్రత్యక్షంగా వినియోగంలోకి వచ్చాయి. దీంతో ఆసుపత్రిలో పారిశుధ్య ప్రమాణాలు మరింత మెరుగవుతాయి, కార్మికుల శ్రమ తగ్గుతుంది, రోగులకు శుభ్రమైన వాతావరణం అందుతుంది.ఈ సందర్భంలో, జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కొత్తగూడెం తరపున సూపరింటెండెంట్ కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ఆయన చూపిన చొరవ ప్రశంసనీయం.

# ఇంత బరి తెగింపా?

* పోలీస్ కుటుంబానికి కేటాయించిన స్థలం కబ్జా!:
* పట్టించుకోని దుండిగల్ రెవిన్యూ అధికారులు!:
* పోలీస్ కుటుంబ భూములే కబ్జా చేస్తే సామాన్యుల పరిస్థితి ఏంటి...?:
* చోద్యం చూస్తున్న రెవిన్యూ అధికారులు!:
* ప్రభుత్వ భూములకు రక్షణ ఎవరు?







కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వ భూములు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే భూ కబ్జాదారులు ఒక అడుగు ముందుకేసి ఏకంగా ఓ పోలీస్ అధికారి కుటుంబానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని దర్జాగా కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు! అప్పనంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టి లక్షలాది రూపాయలకు అమ్ముకునే కబ్జాదారులు తమకు అడ్డుఅదుపు ఎవరూ లేరనే ధీమాతో ఏకంగా ఓ పోలీస్ కుటుంబానికి ప్రభుత్వం కేటాయించిన స్థలం కబ్జా చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇదీ సంగతి!: దుండిగల్ మండలం చర్చి గాగిల్లాపూర్ 214 సర్వే నెంబర్ ప్రభుత్వ స్థలంలో ఓ పోలీస్ అధికారి కుటుంబానికి ప్రభుత్వం 200 గజాల స్థలం కేటాయించింది. ఇటీవల ఆ కుటుంబ సభ్యులకు రెవిన్యూ అధికారులు చర్చ్ గాగిల్లాపూర్ లో ఫలానా స్థలం కేటాయిస్తున్నామని పొజిషన్ కూడా చూపించారు.కానీ అదే ప్రాంతంలో చుట్టుముట్టూ అక్రమ నిర్మాణాలు చేపట్టిన కబ్జాదారులు ఎలాగైనా ఆ పోలీస్ అధికారి కుటుంబం భూమిని కూడా ఆక్రమించాలని ఎత్తుగడ వేశారు!సరిగ్గా ఆ కబ్జాదారులకు కలిసివచ్చేలా సదరు పోలీస్ అధికారి కుటుంబ సభ్యులు తమకు మరింత అనువుగా వుండే స్థలం చూపాలని రెవిన్యూ అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఈ కాస్త సమయమే అదనుగా భావించిన కబ్జాదారులు ఆ స్థలాన్ని కబ్జా చేసి నాలుగు బెస్మెంట్ లను వరుసగా నిర్మించారు.నలభై లక్షలకు పైగా విలువ చేసే ఆ ప్రభుత్వ భూమిని సునాయసంగా నాలుగు బెస్మెంట్ లు వేసి ఆక్రమించారు.ఆ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి పది రోజులైనా రెవిన్యూ అధికారులు ఆ అక్రమ నిర్మాణాలను కూల్చివేయలేదు. దీంతో కబ్జాదారుల బరితెగింపు, రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కబ్జాదారులది ఇంత బరితెగింపా అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. చెప్పేదొకటి.... చేసేది ఇంకోటీ!: గజం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూస్తాం.....ప్రజా అవసరాలకే ప్రభుత్వ భూములు ఉపయోగపడేలా చేస్తాం అని ప్రభుత్వ పెద్దలు,ప్రజా ప్రతినిధులు పదే పదే చెబుతున్నా దుండిగల్ మండలంలో కబ్జాల పర్వం గతం కన్నా మిన్న అన్నట్టుగా సాగుతుంది. చర్చ్ గాగిల్లాపూర్ లో పట్టపగలే ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా రెవిన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఎక్కడో ఒక చోట నామ మాత్రంగా అక్రమ నిర్మాణం కూల్చివేసినా సదరు కాబ్జదారులు మరునాడే తిరిగి అదే ప్రాంతంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారు.ఓ వైపు ప్రభుత్వ భూముల రక్షణకు హైడ్రా వంటి పటిష్టమైన వ్యవస్థను ప్రభుత్వం తీసుకువచ్చినా క్షేత్ర స్థాయిలో రెవిన్యూ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వానికి అపఖ్యాతి వస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి చర్చ్ గాగిల్లాపూర్ లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపడాలని పలువురు సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

* మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : . ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి కలెక్టరు (86) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంకకు శుభాకాంక్షలు



హైదరబాద్, (ప్రజాస్ఫూర్తి) : సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్. ప్రియాంక ని చిన్న, మధ్యతరహా దినపత్రికలు , మ్యాగజైన్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం సోమవారం సాయంత్రం సమాచార శాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో తమ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో కలిసి తమ సమస్యలు వివారిస్తామని తెలుపగా ఆమె సానుకూలంగా స్పందించారు.

## అమాయక రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపాలి

* నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అమాయక రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు లో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.గంజాయి వంటి మత్తు పదార్ధాలు,మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు.ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి,జిల్లాలోని ఇన్స్పెక్టర్స్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరుతో సౌదా కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగ నియమకాల ప్రక్రియను నిలిపివేయాలి

* సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గత నాలుగు రోజులుగా కొత్తగూడెంలో సింగరేణి వీకే ఓసి పేరుతో సౌదా కంపెనీ నిర్వహిస్తున్న సింగరేణి ఓబికి డ్రైవర్స్ ఆపరేటర్స్ హెల్పర్లు సూపర్వైజర్లు కావాలని ఉద్యోగాల ప్రక్రియ ప్రైవేటు యజమాన్యల రూపంలో తీసుకుంటుందనీ తక్షణమే ఈ నియామకాల ప్రక్రియను ఆపాలని కోరుతూ సోమవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ సమావేశం ఐ ఎఫ్ టి యు కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్,శివ,మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి సి నాయకులు ఆల్బర్ట్, హెచ్ఎంఎస్ నాయకులు గడిపల్లి కృష్ణ ప్రసాద్, సిఐటియు భూక్య రమేష్, ఐ ఎఫ్ టి యు గౌని నాగేశ్వరరావు, టియుసిఐ సతీష్ ,టి ఎన్ టి యు సి రవి గౌడ్, బి ఎం ఎస్ రఘు ప్రసంగిస్తూ ఇలా బయోడేటా స్వీకరించి ఈ సౌదా కంపెనీకి ఎలాంటి రిజిస్ట్రేషన్ నెంబర్ లేదు ఆ కంపెనీ నుంచి ఒక రెస్పాన్సిబిలిటీ ఉన్నటువంటి వ్యక్తి కూడా ఇక్కడ లేదు దీనితో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి గతంలో అనేక కంపెనీలు ఆయా ఓబి లలోనే కార్మికులను ఇంటర్వ్యూ చేసి తీసుకునేది కానీ అందుకు విరుద్ధంగా ఈ సౌధ కంపెనీ నిర్వహిస్తున్న బయోడేటా ఇంటర్వ్యూల ఉద్యోగాల నియమకాల విషయంలో అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నాం. 600 మంది కార్మికులు గత ఓసీ లో పనిచేశారు.ఇప్పుడు కొత్తగా సౌదా కంపెనీ అవి విస్మరించి సింగరేణి బి రిజిస్టర్ చూడకుండా కొత్తగా బయోడేటాలు ఇంటర్వ్యూలు స్వీకరించడంలో అంతర్వేమిటో అర్థం కావడం లేదు.తక్షణమే సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకొని ఈ సౌదా నిర్వహిస్తున్న ఉద్యోగాల ప్రక్రియను నిలిపివేయాలని సింగరేణి బి రిజిస్టర్ ప్రకారం పాత వారికి ఉద్యోగాలు ఇప్పించాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీగా సౌదా కంపెనీ ఆఫీస్ లో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిన్ని,ఆంజనేయులు, శివ,మోహన్,వాసు, దినేష్ గౌడ్, అశోక్, శ్రీనివాస్,ఆసిఫ్,ఎం రవి,అఫీతుల, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్ళసింగారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మున్సిపాలిటీ అధ్యక్షులు ఎర్ర శంకర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ తాళ్ళసింగారం నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షునిగా దొనకొండ కిరణ్ కుమార్, ఉపాధ్యక్షునిగా సుక్క నరసింహ, ప్రధాన కార్యదర్శిగా దొనకొండ అనిల్, సహాయ కార్యదర్శిగా దొనకొండ మధు, కోశాధికారిగా ఊదరి సురేష్ లను ఎన్నుకున్నారు. అనంతరం బోయ లింగస్వామి మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా పండుగ ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రవణ్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దొనకొండ కృష్ణ, ఊదరి నరసింహ, సుక్క కృష్ణ, అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ సురేష్, దొనకొండ కృష్ణ, ఊదరి మారయ్య, యాదయ్య, సంజీవ, దొనకొండ అనిల్, సుక్క విఘ్నేష్ శంకరు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడిన వ్యక్తి రిమాండ్




మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : గంజాయితో పట్టుబడిన ఓ వ్యక్తిని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... కలకత్తా కు చెందిన యండి. అదిల్ (36) చెంగిచర్లలో నివాసం ఉంటూ లేబర్ పనులు చేసుకుంటున్నాడు. అయితే ఈ నెల 15న హనుమాన్ నగర్ చెంగిచర్ల లో మేడిపల్లి పోలీసులు, మల్కాజ్గిరి ఎస్ఓటీ పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమనుస్పదంగా ఒక వ్యక్తి కనిపించగా వెంటనే మేడిపల్లి పోలీసులు అతడిని పట్టుకొని అతని దగ్గర ఉన్న కవర్ ను చెక్ చేయగా అతని దగ్గర 30 గ్రాముల గంజాయి దొరికినది. వెంటనే అతడిని విచారించగ అట్టి గంజాయి ని మహారాష్ట్ర నుండి మేకలు తీసుకవచ్చే వ్యక్తి దగ్గర నుండి తీసుకొన్నాడు అని తెల్పినాడు. వెంటనే అతడిని అదుపులోనికి తీసుకోని 30 గ్రాముల గంజాయి ని స్వాధీనపర్చుకొని అతడిని రిమాండ్ చేశారు.

## ప్రశాంతంగా ముగిసిన పీజీఈసెట్ పరీక్ష

తెలంగాణలోని యూనివర్సిటీలు, అనుబంధ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలల్లో 202526 విద్యాసంవత్సరానికి ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎం ఆర్చ్ లాంటి పలు కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పీజీఈసెట్ పరీక్ష సోమవారం మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.ఈ పరీక్షకు మొదటి సెషన్ లో జియోఇంజినీరింగ్, జియోఇన్ఫర్మాటిక్స్ , ఫార్మసీ విభాగాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ , ఫుడ్ టెక్నాలజీ , ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగాలకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించారు.

# హెచ్ఏఎంఎల్‌కు రూ.125 కోట్లు విడుదల.. ఉత్తర్వులు జారీ



పాతబస్తీలో మెట్రో రైలు విస్తరణ పనులకుగాను రాష్ట్ర ప్రభుత్వం 202526 బడ్జెట్ కేటాయింపులో భాగంగా హైదరాబాద్ ఏయిర్ పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) కు రూ.125 కోట్లు విడుదల చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి ఉత్తర్వులు జారీ చేశారు. బడ్జెట్‌లో పాతబస్తీలో మెట్రోరైలు విస్తరణకు రూ.500 కోట్లు కేటాయించారు. అందులో భాగంగానే రూ.125 కోట్లు విడుదల చేశారు. మరో రూ.375 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ రూ.125కోట్లను హెచ్ఏఎంఎల్ పీడీ అకౌంట్‌లో జమచేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతోపాటు వేములవాడ టెంపుల్ ఏరియా డవలప్ మెంట్ ఆథారిటీ(వీటీఏడీఏ)కు రూ.25 కోట్లు చేశారు. బడ్జెట్ లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.100 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే రూ.25కోట్లు పీడీ అకౌంట్‌లో జమ చేశారు. మరో రూ.75 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.



## ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ములుగు డీఈవో

ములుగు: ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) పాణిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. ఆయనతో పాటు జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు హర్జి వ్యక్తిగత కారణాలతో మూడు నెలలపాటు సెలవులో ఉన్నారు. సెలవులు పూర్తి కావడంతో తిరిగి విధుల్లో చేరేందుకు ములుగు డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేశారు. విధుల్లో చేరేందుకు అనుమతి ఇవ్వడానికి ఉపాధ్యాయుడి నుంచి డీఈవో రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆయన ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయుడు హర్జి.. డీఈవో పాణినికి రూ.20 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలోని బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. డీఈవో, జూనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

## జైలుకు వెళ్లాలని కేటీఆర్‌కు కుతూహలంగా ఉన్నట్లుంది: సీతక్క

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు వారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తాను చెప్పలేదని, వారంలోగా స్పష్టత వస్తుందని మాత్రమే చెప్పానని మంత్రి సీతక్క తెలిపారు. కేబినెట్‌లో నిర్ణయం తీసుకోకుండా ఎలా చెబుతానని అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "స్థానిక సంస్థల ఎన్నికలపై ఇవాళ స్పష్టత వస్తుందని భావిస్తున్నాను. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నాయి. బీసీలకు రిజర్వేషన్ల అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో ఇవాళ



స్పష్టత వస్తుందని భావిస్తున్నా. జైలుకు వెళ్లాలని కేటీఆర్‌కు కుతూహలంగా ఉన్నట్లుంది. కవిత జైలుకు వెళ్లి రాగానే లిక్కర్ కేసుపై దృష్టి మళ్లించేందుకు బీసీలు, మహిళలు, దళితులపై ప్రేమ ఒలకబోస్తున్నారు. సానుభూతి కోసమో, లేదంటే ప్రజలను రెచ్చగొట్టేందుకో జైలుకు వెళ్లాలని ఆయన భావిస్తున్నట్లున్నారు. ప్రభుత్వం చట్టప్రకారమే నడుస్తుంది. ఎలాంటి కక్షలు లేవు. ప్రభుత్వం కక్ష సాధింపులకే పాల్పడితే.. ప్రభుత్వం రాగానే వాళ్లను జైల్లో వేసే వాళ్లం కదా. కక్షలు, కార్పణ్యాలు భారాస వాళ్లకే ఉంటాయి. సీఎం రేవంత్‌రెడ్డి పౌరుషంతో మాట్లాడితే.. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నారు" అని సీతక్క విమర్శించారు.

## తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ ఏమైనా చేస్తారు

**: ఎంపీ చామల**

హైదరాబాద్: ఫార్ములా ఈ రేసు కేసులో ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్ కీలకమైన వ్యక్తి అని, కానీ ఇప్పుడు ఆయన కనిపించట్లేదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యే ముందు మీడియాతో మాట్లాడుతూ ఎన్నిసార్లయినా జైలు వెళ్లేందుకు సిద్ధమన్నారు. ఆయన వ్యాఖ్యలపై ఎంపీ స్పందించారు. "అరవింద్ కుమార్ ఎక్కడున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి. ఆయన లేరు కాబట్టి ఏమీ కాదని కేటీఆర్ భావిస్తున్నారు. తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ ఏమైనా చేస్తారు. గతంలో కేటీఆర్ మిత్రుడు కేదార్ విదేశాల్లో చనిపోయారు. కేటీఆర్ ప్లాన్‌తోనే ప్రభాకర్‌రావు అమెరికాకు వెళ్లి దాక్కున్నారు"అని ఎంపీ ఆరోపించారు.



## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి హైకోర్టులో ఊరట

హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట కలిగింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2021 నవంబర్ 15న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా భారీ వాహనాలతో కాన్వాయ్ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల



కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా.. తాజాగా హైకోర్టు కొట్టివేసింది.

## నన్ను జైల్లో పెడితే విశ్రాంతి తీసుకుంటా: కేటీఆర్

హైదరాబాద్: ఫార్ములా ఈరేసు కేసులో కేటీఆర్ ఏసీబీ విచారణ ముగిసింది. ఏసీబీ అధికారులు ఆయన్ను 8 గంటలపాటు ప్రశ్నించారు. కేటీఆర్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే, ఇవాళ విచారణకు సెల్‌ఫోన్ తీసుకురాలేదని కేటీఆర్ చెప్పారు. ఈరేసు సమయంలో వాడిన సెల్‌ఫోన్లను అప్పగించాలని కేటీఆర్‌ను అధికారులు ఆదేశించారు. ఈ నెల 18లోపు సెల్‌ఫోన్లను అప్పగించాలని స్పష్టం చేశారు. విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో



మాట్లాడారు. "ఈ కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చిద్దామంటే.. రేవంత్ పారిపోయారు. లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమని చెప్పినా పత్తాలేరు. ఏసీబీ విచారణలో అధికారులు ఉదయం నుంచీ ఒకటే ప్రశ్న తిప్పి తిప్పి అడిగారు. అవినీతి ఎక్కడ ఉందని ఏసీబీ అధికారులనే అడిగాను. పైనుంచి రాసిచ్చిన ప్రశ్నలనే ఏసీబీ అడిగింది. రేవంత్ జైలుకెళ్లారు.. మమ్మల్నీ జైల్లోపెట్టి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. నన్ను జైల్లో పెడితే విశ్రాంతి తీసుకుంటా. వందల కొద్దీ కేసులు పెట్టినా.. జైల్లో పెట్టినా భయపడను"అని అన్నారు.

## ఇవాళ్టి నుంచే రైతు భరోసా: తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: ఇవాళ్టి నుంచే (సోమవారం) రైతు భరోసా నిధులు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులతో సమావేశం తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల పైనా సీఎం చర్చించారు. జిల్లా ప్రజాప్రతి నిధులతో ఇంఛార్జి మంత్రులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. పాతబస్తీ మెట్రో కనెక్టివిటీ ప్రాజెక్టుకు రూ.125 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 202526 బడ్జెట్‌లోనే రూ.500 కోట్లు కేటాయించింది. అందులోనుంచి రూ.125 కోట్లు విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు ఇచ్చింది. వేములవాడ అభివృద్ధికి రూ. 25కోట్లు మంజూరు చేసింది.

## 1 మార్చి 2027 నాటికి జనగణనతో పాటు కులగణన పూర్తి

**: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

దేశంలో జనగణన తో పాటే కులగణన 2027 మార్చి 1 నాటికి పూర్తి అవుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇది నూతన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నూతన ఒరవడి తెస్తుందని, జనగణన కోసం 34 లక్షల గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్ష మంది సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈసారి జనాభా లెక్కల సేకరణ పూర్తిగా డిజిటల్ విధానంలో ఉంటుందని ప్రతి వ్యక్తి వివరాలు భద్రంగా ఉండేలా అనువైన యాప్ రూపకల్పన జరుగుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మొదటిసారి, బీసీ జనాభా లెక్కల సేకరణ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాలుగా చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించడం కోసం పార్టీ చేపట్టిన కార్యక్రమాలు పూర్తిగా విజయవంతమవుతున్నాయని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికలు ఇప్పటికే జరగాల్సి ఉంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అనేది చాలా ఆలస్యం అయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహిస్తామని గతంలో హామీ ఇచ్చిందని ఆ మాట నిలబెట్టుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించే పరిస్థితి లేదు. వీధిలైట్లు, శానిటేషన్, డ్రింకింగ్ వాటర్ పర్యవేక్షణ లేదు. గత పదేళ్లుగా



కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు 15వ ఫైనాన్స్ ఆధారంగా నిధులు ఇస్తోంది. మన్రేగా నిధులు కూడా కేంద్రమే ఇస్తోందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచుల లేమి కారణంగా పాలన మరింతగా అటకెక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేశారు.

## గోదావరి బనకచర్లపై హరీశ్‌రావు వ్యాఖ్యలు తెలంగాణకు నష్టం: ఉత్తమ్

హైదరాబాద్: గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యల వల్ల తెలంగాణకు నష్టమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆల్ వాటర్స్ అనే పదం కింద ఏపీ 200 టీఎంసీలు తీసుకోగలదనే హరీశ్‌రావు వాదన తప్పని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "వరద నీటిని తీసుకోవడానికి ఏపీకి అనుమతి లేదు. చట్టబద్ధం కాదు. లింక్ ప్రాజెక్టులో పేర్కొన్న 200 టీఎంసీలు బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన నీటిలో భాగం కాదు. గోదావరిలో వరద నీటిని అధికారికంగా నిర్వచించలేదు. లెక్కించలేదు. బచావత్ ట్రైబ్యునల్ గతంలో ఉమ్మడి ఏపీకి 1,480 టీఎంసీలు కేటాయించింది. గోదావరి జలాల్లో తెలంగాణకు 970 టీఎంసీలు ఉన్నాయి. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టు అన్నింటికీ విరుద్ధం. కృష్ణా జలాల్లో మనకు దక్కాల్సిన వాటాను పొందడంలో భారాస విఫలమైంది." అని ఉత్తమ్ తెలిపారు.

## అందాల పోటీలు అట్టర్ ఫ్లాప్: మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన అందాల పోటీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి పాలన గురించి పట్టింపు లేదని.. కక్ష సాధింపునకు ప్రాధాన్యత ఇస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని వేధించడానికి పాలనను పూర్తిగా పక్కన పెట్టారని అన్నారు. నయవంచన, అబద్ధాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఫార్ములా ఈ కార్ల రేసింగ్‌లో ఎలాంటి అవినీతి జరగకున్నా కేటీఆర్‌ను విచారణకు పిలిచారని ఆరోపించారు. ఈ కేసులో అవినీతి సొమ్ము ఎవరికీ ముట్టలేదని.. పారదర్శకంగా డబ్బు బదిలీ ప్రక్రియ జరిగిందని వెల్లడించారు. పెట్టుబడులు తెచ్చిన కేటీఆర్‌పై కేసు పెట్టారని.. అందాల పోటీల్లో అసభ్యంగా ప్రవర్తించిన వారిపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయడం తప్ప అందాల పోటీలతో ఏమైనా ఒరిగిందా? అని నిలదీశారు. భవిష్యత్ ఎలక్ట్రికల్ వెహికల్‌దే అని నమ్మి కేటీఆర్ ఈ రేస్ నిర్వహించారని తెలిపారు.



# బంతిపూల సాగుతో.. ఏడాదికి ఐదు కోట్లు!

**బంతి పూలది చాలా గమ్మత్తయిన సువాసన. అంత ఘాటూ ఉండదు... మరీ తేలిపోయే సుగంధమూ కాదు. ఇంట్లోనూ, వీధుల్లోనూ, గుళ్లలోనూ ప్రతి పూజాపునస్కారానికీ వాడతాం కాబట్టి ఆ వాసన... ఎన్నో బాల్యజ్ఞాపకాలని తట్టిలేపుతుంటుంది. అరూప్ కుమార్ ఘోష్‌కీ బంతిపూలతో అలాంటి సుగంధాల బంధమే. కానీ అదే అతణ్ణి దేశంలోని అతిపెద్ద పూలవ్యాపారుల్లో ఒకడిగా నిలబెట్టింది! హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లో రోజు కూలీగా ఉన్నవాణ్ణి కాస్తా... ఏడాదికి ఐదుకోట్ల రూపాయలు సంపాదించేట్టు చేసింది. ఆ కథేమిటో చూద్దామా...**

అరూప్ ఘోష్ 2010లో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండేవాడు. తండ్రి రెండెకరాలు సాగుచేసే సన్న కారు రైతు. ఆ ఏడాది వరిసాగులో నష్టం రావడంతో అరూప్ చదువు కొనసాగించలేని పరిస్థితి. దాంతో పశ్చిమ బెంగాల్‌లోని వాళ్లుంటున్న కోలాఘాట్ టౌన్‌లో అతిపెద్ద పూలమార్కెట్ ఉంటే... అక్కడికి కూలీగా వెళ్లాడు. అలా పూలతో అదీ బంతిపూలతో ఏర్పడ్డ సహవాసం అతణ్ణి 'ఇక నా జీవితం ఇందులోనే!' అనుకునేలా చేసింది. అక్కడ పనిచేసేటప్పుడే కోలాఘాట్ మార్కెట్ నుంచి హైదరాబాద్ గుడిమల్కాపూర్ మార్కెట్‌కి రోజూ బంతిపూల మాలలూ, రజనీగంధ పూలూ సరఫరా కావడం గమనించాడు. 'దక్షిణాదిలో అతిపెద్ద పూలమార్కెట్ అదే' అని అందరూ అంటుంటే అరూప్‌కి ఇక్కడికి రావాలనిపించిందట. దాంతో రెండు జతల బట్టలు సంచీలో పెట్టుకుని హైదరాబాద్ వచ్చేశాడు. ఓ పూల దుకాణంలో రోజు కూలీగా చేరాడు... నెలకి రూ.3500 జీతం. మెల్లగా పూల రకాలూ, సీజన్‌లనిబట్టి వాటి ధరవరలూ, వాటిని నిల్వచేసే విధానాలపైన పట్టు సాధించాడు. అప్పుడే తానూ వ్యాపారిగా మారాలన్న కలలు మొదలయ్యాయి. ఆ కలతోనే మళ్లీ సొంతూరికొచ్చాడు. కోలాఘాట్‌కి వచ్చి అక్కడి నుంచి హైదరాబాద్‌కి పూలు సరఫరా చేయడం మొదలుపెట్టాడు. మంచి ఆదాయమే వచ్చేది కానీ అరూప్ అక్కడితో ఆగిపోవాలనుకోలేదు...

### నష్టం వచ్చినా...

'ఎవరో సాగుచేసిన పూలని అమ్మడం కన్నా... మనమే మనం కోరుకున్న నాణ్యతలో కావాల్సిన మోతాదులో పూలని ఉత్పత్తి చేయొచ్చుకదా' అన్న ఆలోచనతో సాగు మొదలుపెట్టాడు అరూప్. వాళ్ల నాన్నకున్న రెండెకరాల నుంచి 25 సెంట్ల భూమిని తీసుకుని బంతిపూల సాగు మొదలుపెట్టాడు. అవి అటు రాశిలోకానీ ఇటు వాసిలోకానీ తీసికట్టనిపించాయి. పెట్టుబడి కూడా వెనక్కి రాలేదు. అయినా అతని మనసు ఊరుకోలేదు. ఓసారి మిత్రులతో కలిసి థాయ్‌లాండ్ పర్యటనకని వెళ్లాడు. అక్కడి







'టెన్నిస్‌బాల్' జాతి బంతిపూలని చూసి అప్రతిభుడయ్యాడు. 'మనదేశంలోని బంతిపువ్వుల్ని అరచేతిలోకి తీసుకుని కాస్త సుతారంగా నొక్కినా రేకులురేకులుగా విడిపోతాయి. కానీ థాయ్‌లాండ్ పూలని చేతిలో పెట్టుకుని పిడికిలి బిగించినా ఏమీ కావు... టెన్నిస్ బంతిలా ముడుచుకుని మళ్లీ పెద్దగా విచ్చుకుంటాయి. అలాంటి వెరైటీయే ఎగుమతులకి అనువుగా ఉంటుందనిపించింది. దాంతో మూడునెలలు అక్కడే ఉండి ఆ పూల సాగులోని మెలకువలు నేర్చుకున్నాను' అంటాడు అరూప్. థాయ్‌లాండ్ నుంచి వచ్చేటప్పుడు 25 గ్రాముల విత్తనాలని తెచ్చుకున్నాడు.

### ఒక్కొక్కటే నేర్చుకుంటూ...

ఆ విత్తనాలని ముందు అర ఎకరంలోనే సాగుచేశాడు అరూప్ కుమార్. 45 రోజుల్లోనే అవి పూలనివ్వడంతో కేజీ వంద రూపాయలకి (మామూలు రకం పూలు రూ.80 ఉండేవి) మార్కెట్‌లో అమ్మాడు. వాటికి మంచి డిమాండు రావడమేకాక రైతులందరూ ఆ విత్తనాల కోసం అడగసాగారు. దాంతో మరో ఆరు ఎకరాలు గుత్తకి తీసుకోవడంతోపాటు 'ఏకేజీ నర్సరీ' అనే సంస్థని స్థాపించి విత్తనాలనీ మొక్కల్నీ అమ్మసాగాడు. అది 2013 సంవత్సరం... అరూప్ వయసు అప్పుడు ఇరవైమూడేళ్లే. క్రమంగా ఆ ఆరున్నర ఎకరాలు కాస్తా 13 ఎకరాలయ్యాయి. ఇప్పుడు 45 ఎకరాలని లీజుకు తీసుకుని దేశవ్యాప్తంగా అటు పూలనీ, ఇటు మొక్కలూ విత్తనాలనీ విక్రయిస్తున్నాడు. ఏటా సుమారు 1200 కేజీల విత్తనాలని... కేజీ పాతికవేల చొప్పున అమ్ముతున్నాడు. ప్రతి మొలకా (సీడ్లింగ్) 40 పైసల వంతున ఏటా రెండున్నర కోట్ల మొక్కల్ని విక్రయిస్తున్నాడు. వీటన్నిటితో ఏటా ఐదుకోట్ల రూపాయలదాకా రాబడి వస్తోంది. అంతేకాదు... పూలవ్యాపారిగా పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా 13 షాపుల్ని తెరిచాడు అరూప్. వాటి ద్వారా బంతి పూలని దేశం నలుమూలలకీ సరఫరా చేస్తున్నాడు. అరూప్ నుంచి యువత నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది కదూ!





# అందాల టీపాయ్ అదిరింది!

**నట్టింటికి అందాన్ని తీసుకొచ్చే టీపాయ్ చుట్టే తిరుగుతున్నాయి ఇంటీరియర్ ట్రెండ్స్ అన్నీ. ఇంట్లోకి వచ్చీరాగానే కనిపించే కాఫీ టేబుళ్లతోనే కళాఖండాల్ని సృష్టిస్తున్నారు. అక్వేరియపు అందాలు మొదలు ప్రకృతి దృశ్యాల వరకూ అన్నింటినీ ఈ సెంటర్ టేబుళ్లలోకి చేర్చి, సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారుస్తున్నారు.**

ఒకప్పుడు కలపతో చేసిన కాఫీ టేబుళ్లలోనే తీరొక్క రకాలొచ్చాయి, అందులోనే బోలెడన్ని చెక్కుళ్లు కనువిందుచేసేవి. ఇంటి అలంకరణకు తగ్గట్టు ప్రతిదాంట్లో వచ్చిన ఆ మార్పు... ఈ టేబుళ్లలోకీ రావడంతో గాజు, మెటల్ అందాలూ టీపాయ్‌లో భాగం అయ్యాయి. ఆ తర్వాత ఇంటీరియర్స్‌లో ఎంట్రీ ఇచ్చిన ఎపాక్సీ రెజిన్ ఇంటి అలంకరణ వస్తువుల్లో ముఖ్యంగా లివింగ్ రూమ్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఉండే టీపాయ్‌లన్నింట్లో చేరిపోయింది. జిగురులా ఉండే ఈ ఎపాక్సీ రెజిన్... మెరుపుతోపాటు కళాఖండాన్ని తయారుచేయడానికి అనువుగా ఉండటంతో ఆర్ట్‌పీసుల్లాంటి టీపాయ్‌ల తయారీకి ఇదే ప్రధానమైంది. అందుకే ఇంటీరియర్ డిజైనర్లు దీంతోనే కాఫీ టేబుళ్లలో ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సృజనకు పదునుపెడుతూ త్రీడీ బొమ్మలతో మాయ చేసే ఎపాక్సీ టీపాయ్‌లకు రూపమిస్తున్నారు!

### అన్నివైపులా అందంగా...



టీకాఫీలూ, పేపర్లూ పెట్టుకునే కాఫీ టేబుల్ కాస్త ప్రత్యేకంగా ఉంటే కచ్చితంగా గదికే అందం వస్తుంది. మరి ఆ సొగసు టేబుల్ పైభాగంలో మాత్రమే కనిపిస్తే సరిపోతుందా... టేబుల్ అన్నివైపుల నుంచీ ఆకట్టుకుంటే మరింత అదిరిపోదూ! సరిగ్గా ఆ ఆలోచనతోనే టేబుళ్ల లోపలా ప్రకృతి దృశ్యాల్ని సృష్టించారు. కలప, గాజు, ఎపాక్సీ రెజిన్‌లను ఉపయోగిస్తూనే ఈ త్రీడీ నేచర్ టేబుళ్లను తయారుచేస్తున్నారు. చూడగానే 'నిజంగానే అక్కడో పులి ఉందా, కొండల నడుమ నది పారుతోందా, పూల వనంలో ఇన్ని రంగులా, డాల్ఫిన్ నీళ్లలో చక్కర్లు కొడుతోందా' అన్నట్టుగా ఎంతో సహజంగా ఉంటాయీ టీపాయ్‌లోని దృశ్యాలన్నీ. రకరకాల జీవుల బొమ్మల్ని త్రీడీ రూపంలో తయారుచేసి, చుట్టూ ఉన్న పరిసరాల్నీ చక్కగా తీర్చిదిద్దుతూ... అసలైన వాటిలా కనిపించేలా రంగుల ఎపాక్సీ రెజిన్‌ని వాడుతున్నారు. కొన్నింటికి ఎల్ఈడీ బల్బులతో సరికొత్త కాంతుల్ని తీసుకొస్తున్నారు.

ప్రతి కళలోనూ అద్భుతాలు చేసే ఆర్టిస్టులు ఉన్నట్టే ఈ ఎపాక్సీ రెజిన్ ఆర్ట్‌లోనూ అలాంటి చేయి తిరిగిన కళాకారులున్నారు. వాళ్లే ఈ మెరిసే టీపాయ్‌ల్ని డిజైన్ చేస్తూ ఇంటీరియర్ మొత్తానికీ నయా లుక్కును తెస్తున్నారు. ఏది ఏమైనా, లివింగ్ రూమ్ మధ్యలో పెట్టిన కాఫీ టేబులే ఇంటికి అతిపెద్ద డెకరేషన్ కావడం నిజంగా గొప్ప









# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజైన సోమవారం లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు ఒకశాతం వరకు లాభాలను నమోదు చేశాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా మార్కెట్లు రాణించాయి. సెన్సెక్స్ కిత్రం సెషన్‌తో పోలిస్తే 81,034.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 81,012.31 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,865.82 పాయింట్ల వరకు పెరిగింది. నిఫ్టీ 227.90 పాయింట్లు లేదా 0.92 శాతం పెరిగి 24,946.50 వద్ద ముగిసింది. దాదాపు 1898 షేర్లు లాభపడగా.. 2,026 షేర్లు పతనమయ్యాయి.

నిఫ్టీలో అత్యధికంగా లాభపడ్డ వాటిలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఓఎన్‌జీసీ ఉన్నాయి. అయితే టాటా మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా నష్టపోయాయి. ఐటీ, మెటల్, రియాలిటీ, ఆయిల్, గ్యాస్ ఒక్కొక్కటి ఒకశాతం పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.9 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి.

# పశ్చిమాసియా సంక్షోభంతో పెరుగుతున్న ముడి చమురు ధరలు..

### భారత కంపెనీలపై ఒత్తిడి..!



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం భారత చమురు మార్కెట్‌తో పాటు గ్యాస్ కంపెనీలపై ఆర్థికంగా ఒత్తిడి పడే అవకాశం ఉన్నది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం.. ముడి చమురు ధర ప్రస్తుతం బ్యారెల్‌కు 73 డాలర్ల నుంచి 74 డాలర్ల వరకు ఉన్నది. అయినప్పటికీ.. చమురు మార్కెట్ కంపెనీల ఆదాయంపై ప్రభావితమవుతున్నది. అదే సమయంలో అప్‌స్ట్రీమ్ కంపెనీల ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నది. అప్‌స్ట్రీమ్ కంపెనీలు చమురు, గ్యాస్ పరిశ్రమ ప్రారంభ భాగంలో పని చేస్తుంటాయి. భూమి నుంచి చమురు, గ్యాస్‌ను వెలికితీసే ప్రక్రియ.

ఇది గ్యాస్ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి. ఎల్ఎన్‌జీ ముడి చమురుకు సంబంధించింది. ముడి చమురు ధర పెరిగితే.. ఎల్ఎన్‌జీ ధర సైతం పెరుగుతుంది. చమురు ధరల్లో ఈ పెరుగుదల ఇప్పటికీ 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పెరుగుదల కంటే తక్కువగా ఉందని పేర్కొంది. ప్రస్తుత పెరుగుదల గత నాలుగు సంవత్సరాల సగటు కంటే చాలా తక్కువగా ఉన్నది. ప్రస్తుతం, బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 75 డాలర్లుగా ఉన్నది. ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి విశ్లేషకుల అంచనా 68 డాలర్ల కంటే కంటే దాదాపు 6-7 డాలర్లు ఎక్కువ. అయినప్పటికీ, ముడి చమురు ధరలు 2022-25 సగటు కంటే 9డాలర్లు తక్కువగా.. 25 ఆర్థిక సంవత్సరం సగటు కంటే 4డాలర్లు తక్కువగా ఉన్నది. డిమాండ్ లేకపోవడం మార్కెట్‌ను ఆధిపత్యం చేస్తుంది. అయితే, ఇంధన కంపెనీ స్టాక్స్ హెచ్చుతగ్గులను చూస్తున్నాయి. ఇది ప్రపంచ అనిశ్చితుల మధ్య మార్కెట్ ఆందోళనలను ప్రతిబింబిస్తున్నది. దీని వెనుక కారణం హార్ముజ్ జలసంధిలో తీవ్రమవుతున్న సంక్షోభం కారణం. హార్ముజ్ జలసంధి ప్రపంచంలోని కీలకమైన సముద్ర మార్గాల్లో ఒకటి. ఎందుకంటే ఇది పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలుపుతుంది. ప్రపంచంలోని చమురు రవాణాలో ఎక్కువ భాగం ఈ మార్గం గుండా వెళుతుంది. భారతదేశం చమురు దిగుమతుల్లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ, ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో సగానికిపైగా హార్ముజ్ జలసంధి గుండా వెళతాయి. ఈ మార్గంలో ఏదైనా ఆటంకాలు ఎదురైతే.. భారతదేశం ఇతర వనరులు, మార్గాల కోసం వెతకాల్సిన అవసరం ఏర్పడుతుంది.

## సరికొత్త రీచార్జ్ ప్లాన్
# ప్రకటించిన బీఎస్ఎన్ఎల్..!

### రూ.198కే 40 డేస్ వ్యాలిడిటీతో డేటా ప్లాన్..!




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ టెలికాం కంపెనీ భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ యూజర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగా తక్కువ ధరకు సరికొత్త రీచార్జ్ ప్లాన్‌ను పరిచయం చేస్తున్నది. గతంలో ప్రతి ఇంట్లో బీఎస్ఎన్ఎల్ సిమ్ ఉండేది. ఇటీవల కొంతకాలంగా రెండు ప్రైవేటు టెలికాం కంపెనీల హవా కొనసాగుతున్నది. ఆయా కంపెనీలు టారిఫ్ ప్లాన్స్ ధర పెంచుతుండడంతో మళ్లీ యూజర్లు బీఎస్ఎన్ఎల్ వైపు దృష్టి సారిస్తున్నది. దాంతో ప్రభుత్వ రంగ సంస్థ సైతం తక్కువ ధరకు, అధిక వ్యాలిడిటీతో ప్లాన్స్‌ను తీసుకువస్తున్నది. ఈ క్రమంలోనే కొత్తగా చౌక ప్లాన్‌ను తీసుకువచ్చింది. రూ.198కే 40 రోజుల వ్యాలిడిటీ ఉండనున్నది. ఈ బీఎస్ఎన్ఎల్ ప్లాన్లో ప్రతి రోజూ 2జీబీ హైస్పీడ్ డేటా పొందుతారు. అంటే 40 రోజుల పాటు డేటా పొందుతారు. 2జీబీ డేటా ముగిసిన తర్వాత 40కేబీపీఎస్ వేగంతో అపరిమిత డేటా వాడుకోవచ్చు. బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో సమాచారం ఇచ్చింది. ఈ ప్లాన్ డేటా యూజర్లకు మాత్రమే. ఎందుకంటే ఈ ప్లాన్‌లో కాలింగ్ సౌకర్యం అందుబాటులో ఉండదు. ఇదిలా ఉండగా.. బీఎస్ఎన్ఎల్ సాయుధ దళాల ధైర్యసాహసాలను గౌరవించేందుకు ప్రత్యేక రీచార్జ్ ఆఫర్‌ని ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ గౌరవార్థం ఈ ఆఫర్‌ని తీసుకువచ్చింది. ఆ ప్యాక్‌లో ఓ యూజర్ రూ.1,499తో రీచార్జ్ చేస్తే.. మొత్తంలో 2.5శాతం రక్షణశాఖకు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దాంతో పాటు యూజర్లకు సైతం 2.5శాతం క్యాష్‌బ్యాక్ తిరిగి పొందుతారు. ఈ ఆఫర్ జూన్ 30 వరకు చెల్లుబాటు కానున్నది.

# వరుస వివాదాల్లో దిగ్గజ స్పిన్నర్



### ఈసారి బాల్ ట్యాంపరింగ్ ఉచ్చు..!

న్యూఢిల్లీ: భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వరుసగా వివాదాల్లో నిలుస్తున్నాడు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్‌లో మహిళా అంపైర్‌తో గొడవ పడిన అశ్విన్.. వారం తిరగకుండానే తాజాగా మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. ఈసారి ఈ దిగ్గజ స్పిన్నర్ బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. టీఎన్‌పీఎల్‌లో దుండిగల్ డ్రాగన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అశ్విన్ బంతి స్వరూపాన్ని మర్చేందుకు ప్రయత్నించాడని సైచెమ్ మధురై పాంథర్స్ జట్టు ఫిర్యాదు చేసింది. తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో భాగంగా జూన్ 14న సేలంలోని ఎస్‌సీఎఫ్ క్రికెట్ మైదానంలో దుండిగల్, మధురై పాంథర్స్ తలపడ్డాయి. అయితే.. ఈ మ్యాచ్‌లోనే అశ్విన్, అతడి జట్టు సభ్యులు బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డారని మధురై పాంథర్స్ యాజమాన్యం టీఎన్‌పీఎల్ నిర్వాహకులకు లేఖ రాశారు. అందులో ఏముందంటే 'అశ్విన్, అతడి సహచరులు రసాయనాల్లో ముంచిన టవళ్లతో బంతిని పదే పదే తుడిచారు. తద్వారా బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించారు. అలా చేయడం తప్పని వారించినా కూడా వినకుండా బాల్ ట్యాంపరింగ్‌ను కొనసాగించారు' అని మధురై పాంథర్స్ తమ ఫిర్యాదులో రాసుకొచ్చింది. అయితే.. టీఎన్‌పీఎల్ సీఈవో ప్రసన్న కన్నన్ మాత్రం బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలను కొట్టిపారేయలేదు. అశ్విన్, అతడి జట్టు సభ్యులు ఈ నేరానికి పాల్పడ్డారనడానికి తగిన ఆధారాలను సమర్పించాలని మధురై పాంథర్స్‌ను ఆదేశించింది. 'మధురై పాంథర్స్ యాజమాన్యం బాల్‌ట్యాంపరింగ్‌పై ఫిర్యాదు చేసింది. వాళ్ల లేఖను మేము స్వీకరించాం. అయితే.. ఎవరైనా సరే మ్యాచ్ జరిగిన 24 గంటల్లోనే కంప్లైట్ చేయాల్సి ఉంటుంది. అయినా కూడా మేము ఆ ఫ్రాంచైజీ లెటర్‌ను తీసుకున్నాం. అందుకు తగిన ఆధారాలు చూపించాల్సిందిగా కోరాం. ఒకవేళ వాళ్ల ఆరోపణలు నిజమైతే.. ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేస్తాం. ఎందుకంటే.. ఎవిడెన్స్ లేకుండా క్రికెటర్లపై నిందలు వేయడం క్షమించరాని నేరం అవుతుంది. మధురై పాంథర్స్ గనుక ఆధారాలను చూపకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం' అని ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు.

# శిక్షణ శిబిరంలో ఇద్దరికి గాయాలు..

### అండర్ -19 స్క్వాడ్‌లో మార్పులు..!

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనకు ముందే అండర్ -19 స్క్వాడ్‌లోని భారత యువ క్రికెటర్లు గాయపడ్డారు. దాంతో, 16మందితో కూడిన స్క్వాడ్‌లో మార్పులు చేశారు సెలెక్టర్లు. ఇంగ్లండ్ టూర్ సన్నద్ధతలో భాగంగా బెంగళూరులోని





బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహిస్తున్న హై- పర్మార్మెన్స్ క్యాంప్‌లో ఆదిత్య రానా, ఖిలాన్ పటేల్ గాయాలబారిన పడ్డారు. వీపు భాగంలో స్ట్రెస్ ఫ్రాక్చర్‌తో ఆదిత్య ఇబ్బందిపడగా.. ఖిలాన్ కుడి కాలి నొప్పితో బాధ పడుతున్నాడు. దాంతో, ఈ ఇద్దరి స్థానంలో ది. దీపేశ్, నమన్ పుష్పక్‌లను జూనియర్ క్రికెట్ కమిటీ ఎంపిక చేసింది.

ఇంగ్లండ్ గడ్డపై భారత కుర్రాళ్లు 50 ఓవర్ల వామప్ మ్యాచ్, నాలుగు మ్యాచ్‌ల యూత్ వన్డే కప్ సిరీస్, రెండు మల్టీ డే మ్యాచ్‌లు ఆడనున్నారు. జూన్-జూలై.. అంటే దాదాపు నెలన్నర రోజుల పైనే భారత అండర్ -19 జట్టు ఇంగ్లండ్‌లో ఉండనుంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో మెరుపు బ్యాటింగ్‌తో అలరించిన మాత్రే భారత అండర్ -19 బృందానికి సారథ్యం వహించనున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేసి.. రికార్డు సెంచరీ (35 బంతుల్లోనే)తో ఆశ్చర్యపరిచిన వైభవ్ సూర్యవంశీ ఈ సిరీస్‌లో కీలకం కానున్నాడు.

అండర్ -19 స్క్వాడ్ : ఆయుశ్ మాత్రే(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్‌సింగ్ చవ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు(వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), హర్వన్ష్ సింగ్(వికెట్ కీపర్), ఆర్.ఎస్. అంబ్రిష్, కనిష్క్ చౌహన్, హెనిల్ పటేల్, యుధజిత్ గుహ, ప్రణవ్ రాఘువేంద్ర, మహ్మద్ ఇనాన్, అన్మోల్‌జిత్ సింగ్. డి.దీపేశ్, నమన్ పుష్పక్.

## సెప్టెంబర్ 30 నుంచి
# మహిళల వన్డే వరల్డ్ కప్

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ముగియడమే ఆలస్యం మరో మెగా టోర్నీ అభిమానులను అలరించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ సోమవారం మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 30న షురూ కానుంది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ ఆరంభం రోజే టీమిండియా బెంగళూరులో శ్రీలంకతో తలపడనుంది.

అయితే.. టీమిండియా, పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 5న జరుగనుంది. పహల్గాం ఉగ్రదాడి.. ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల నేపథ్యంలో పాక్ మ్యాచ్‌లకు లంక వేదిక కానుందని ఐసీసీ పేర్కొంది. కొలంబోలో ఏకంగా 11 లీగ్ మ్యాచ్‌లకు ఐసీసీ ఆమోదం తెలిపింది.

వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టనుంది. సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న భారత్, శ్రీలంకలు ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నాయి. సెప్టెంబర్ 30 లంక, టీమిండియా పోరుతో మెగా టోర్నీ షురూ కానుంది. అనంతరం అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో ఆసీస్ తలపడనుంది. మొత్తంగా కొలంబోలో 11 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అక్టోబర్ 29న కొలంబో లేదా బెంగళూరులో తొలి సెమీ ఫైనల్




జరుగనుండగా.. అక్టోబర్ 30న బెంగళూరులో రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఉండనుంది. టైటిల్ విజేతను నిర్ణయించే ఫైనల్ పోరు నవంబర్ 2న జరుగనుంది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు లేదా కొలంబో వేదిక కానుందని ఐసీసీ వెల్లడించింది.

# వైజాగ్‌లో టీమిండియా మ్యాచ్..

### కివీస్‌తో తలపడనున్న భారత్
### రెండేళ్ల తర్వాత వైజాగ్‌లో అంతర్జాతీయ మ్యాచ్
### 2026లో భారత్, న్యూజిలాండ్ మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్
### సిరీస్‌లోని నాలుగో టీ20కి విశాఖపట్నం ఆతిథ్యం

**విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్ లోని క్రికెట్ అభిమానులకు, ముఖ్యంగా విశాఖపట్నం వాసులకు శుభవార్త.. త్వరలో విశాఖలో టీమిండియా మ్యాచ్ జరగనుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో న్యూజిలాండ్ తో టీ20 సిరీస్ జరగనుంది. ఐదు మ్యాచ్ ల ఈ సిరీస్ లో నాలుగవ టీ20 మ్యాచ్‌కు విశాఖపట్నం వేదిక కానున్నట్లు సమాచారం. 2026 జనవరి 21 నుంచి జనవరి 31 వరకు భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా నాలుగవ టీ20 మ్యాచ్‌ను జనవరి 28న విశాఖపట్నంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీంతో స్థానిక క్రికెట్ ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా హైదరాబాద్ లేదా వైజాగ్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌లు పెద్దగా జరగకపోవడం, కేవలం ఐపీఎల్ మ్యాచ్‌లకే పరిమితం కావడంతో ఈ వార్త ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే, ఈ సిరీస్ కు సంబంధించిన మ్యాచ్‌ల వేదికల్లో హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియానికి చోటు దక్కలేదని తెలుస్తోంది. కేవలం విశాఖపట్నంలో మాత్రమే ఒక




టీ20 మ్యాచ్ జరగనుండగా, మిగిలిన నాలుగు మ్యాచ్‌లను నాగ్‌పూర్, రాయ్‌పూర్, గువహటి మరియు తిరువనంతపురం నగరాల్లో నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ వార్తల నేపథ్యంలో, మ్యాచ్ టికెట్ల కోసం ఇప్పటినుంచే సిద్ధం కావాలంటూ కొందరు అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే, దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# రాజాసాబ్ టీజర్ విడుదల

## ప్రభాస్ ఫ్యాన్స్‌కు పండగ




**టాకీస్:** రెబల్ స్టార్ ప్రభాస్ 'సలార్', 'కల్కి 2898 ఏడీ' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న తర్వాత మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్ చిత్రం మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఈ చిత్రంతో వింటేజ్ ప్రభాస్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తామని దర్శకుడు మారుతి చాలా బలంగా చెబుతున్నారు. 'ది రాజా సాబ్' నుంచి ఇప్పటి వరకు విడుదలైన స్టిల్స్ చూస్తే అభిమానుల్లో కూడా నమ్మకం బలపడింది. ది రాజా సాబ్ చిత్రం రొమాంటిక్ హారర్ కామెడీ జానర్‌లో రూపొందు తోంది. ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిధి కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. దాదాపు చిత్ర షూటింగ్ పూర్తైనట్టు తెలుస్తుండగా, ఈ మూవీని డిసెంబర్ 5, 2025న విడుదల చేయనున్నట్టు కొద్ది రోజుల క్రితం ప్రకటించారు మేకర్స్ . ఇక చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా కొద్ది సేపటి క్రితం టీజర్ విడుదల చేశారు. ఇది ఫ్యాన్స్ అంచనాలని రెట్టింపు చేసింది. వింటేజ్ ప్రభాస్ ఈజ్ బ్యాక్ అని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.ఇక ఇప్పటి నుండి ఇండియా అంతా 'రాజా సాబ్' మ్యాడ్‌నెస్ చూస్తుంది. ప్రేక్షకులు అందరికీ ఒక విజువల్ ఫీస్ట్. టీజర్ మాత్రం చితక్కొట్టేసింది. ఇన్నాళ్లు వెయిట్ చేసిన దానికి మంచి ప్రతిఫలం దక్కిందని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.ఫ్యాన్స్ ప్రభాస్ ను ఎలా చూడాలనుకుంటున్నారో మారుతి ప్రభాస్ ను అలా చూపించారు. ట్రైలర్లో చివరి షాట్, డైలాగ్ మాత్రం అందరికీ నచ్చేలా ఉంది.148 సెకన్ల నిడివి ఉన్న ఈ రాజా సాబ్ టీజర్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ముగ్గురు హీరోయిన్ల గ్లామర్, వారితో ప్రభాస్ చేసిన సీన్లు, కామెడీ, రొమాంటిక్ ట్రాక్ అదిరిపోయింది. ఇక సంజయ్ దత్ వింత గెటప్స్, ఆ రాజ మహల్ చుట్టూ జరిగే కథ, హారర్ ఎలిమెంట్స్ అదిరిపోయాయి అనే చెప్పాలి. వీఎఫ్ఎక్స్ కూడా బాగుంది. ఈ టీజర్‌ను అధికారికంగా విడుదల చేయకముందే ఆన్‌లైన్‌లో లీక్ కావడం, మేకర్స్‌కు ఆందోళన కలిగించింది. లీక్ అయిన కంటెంట్‌ను షేర్ చేసే అకౌంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరికలు జారీ చేశారు. ప్రభాస్ అభిమానులు ఈ చిత్రంపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం ఐదు భాషల్లో వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా భారీ హవేలీ సెట్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. 41,256 స్క్వేర్ ఫీట్ విస్తీర్ణంతో ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ నంబియార్ ఈ రికార్డ్ స్థాయి హవేలీ సెట్ ను నిర్మించారట.. భారతీయ సినిమా చరిత్రలో మరే హారర్ మూవీకి ఇంత భారీ సెట్ నిర్మించలేదు. ఈ సినిమాతో ప్రభాస్ క్రేజ్ మరింత పెరగనుందని అంటున్నారు.

## పవన్ కల్యాణ్‌కు డైరెక్ట్ చేయాలని ఉంది : ధనుష్



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ హీరో, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో సినిమా చేయాలని చాలా మంది టెక్నీషియన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అయితే ఇప్పుడు పవన్ కళ్యాణ్ రాజకీయాలతో బిజీగా ఉ ఒడడం వలన సినిమాల సంఖ్య తగ్గించే అవకాశం ఉంది. గతంలో ఆయన కమిటైన మూడు సినిమాలని ప్రస్తుతం పూర్తి చేసే పనిలో ఉ న్నాడు పవన్. ఇటీవలే హరిహర వీరమల్లు, ఓజీ చిత్రాల షూటింగ్ పూర్తి చేసిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం చేస్తున్నాడు. అయితే పవన్ కళ్యాణ్‌ని డైరెక్ట్ చేయాలనే కోరిక తనకి ఉందని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన కుబేర సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో తమిళ స్టార్ హీరో ధనుష్ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. తెలుగులో నాకు డైరెక్షన్ చేసే అవకాశం వస్తే, పవన్ కళ్యాణ్ సార్‌ను డైరెక్ట్ చేయాలనుంది అని ధనుష్ చెప్పగానే, ఆడిటోరియం మొత్తమూ ఉ ర్రూతలూగింది. అభిమానులు ఈలలు, కేకలతో జోరుగా స్పందించారు. పవన్ కళ్యాణ్ పట్ల తన అభిమానాన్ని ధనుష్ ఇప్పటికే ఎన్నోసార్లు వ్యక్తం చేశారు. గతంలోనూ "తెలుగులో నాకు ఇష్టమైన హీరో పవన్ కళ్యాణ్" అని చెప్పిన ధనుష్, ఇప్పుడు మరో అడుగు ముందుకేసి, ఆయనని నేను డైరెక్ట్ చేయాలనుకుంటున్నా అని చెప్పడం అభిమానుల్లో ఆనందం నింపింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న కుబేర సినిమాలో ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో రష్మిక మందన్నా, నాగార్జున కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం జూన్ 20న విడుదల కానుంది. ఈ చిత్ర విజయంపై మంచి అంచనాలే ఉన్నాయి. గత రాత్రి జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యాంకర్ సుమ తో ధనుష్ చేసిన సరదా సంభాషణ కూడా ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. . ఒకటో తారీఖు కష్టాలు మీకూ ఉ ంటాయా అని సుమ ప్రశ్నించింది. ధనుష్ బదులిస్తూ నాకు ఎందుకు ఉ ఒడవు, పక్కాగా ఉంటాయి. మీరు రూ. 150 సంపాదిస్తే 200 సమస్యలు ఉంటాయి. నేను కోటి సంపాదిస్తే 2 కోట్ల సమస్యలు ఉ ంటాయి అని ధనుష్ తెలిపారు. ఇక ధనుష్ నటిస్తున్న కుబేర విజయవంతమైతే, ధనుష్ నుంచి మరిన్ని తెలుగు సినిమాలు రావడం ఖాయం అనే నమ్మకం అభిమానుల్లో నెలకొంది.

## న్యూలుక్‌తో అలరిస్తున్న శివానీ

**టాకీస్:** ఇండస్ట్రీలో కొత్త అందాలు ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొత్త కొత్త హీరోయిన్ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సినిమా సినిమాకు కొత్త హీరోయిన్స్ పరిచయం అవుతూ దూసుకుపోతున్నారు. ఇక చాలా మంది హీరోయిన్స్ కు అవకాశాలు చాలా చిత్ర విచిత్రంగా వస్తుంటాయి. కొంతమంది ఎంతో కష్టపడి అవకాశాలను అందుకుంటున్నారు. మరికొంతమందికి ఈ మధ్య సోషల్ మీడియా పుణ్యమా అని హీరోయిన్ అవకాశాలు అందుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ అలా వచ్చిన వారే..



అయితే ఇప్పుడు మనం చూస్తున్న హీరోయిన్ కూడా విచిత్రంగా హీరోయిన్ గా మారిపోయింది. హీరోయిన్ పాత్ర కోసం ఆడిషన్ కు వెళ్తే అనుకోకుండా హీరోయిన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ఇప్పటికే చాలా మంది హీరోయిన్ తెలుగులో రాణిస్తున్నారు వారిలో శివాని నాగరం ఒకరు. ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా. శివాని నాగరం నటనా జీవితాన్ని ఆడిషన్‌ల ద్వారా ప్రారంభించింది. ఈ అమ్మడి మొదటి సినిమా అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు (2024), ఈ చిత్రంలో సుహాస్ సరసన హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ఆమె లక్ష్మి అనే పాత్రలో కనిపించింది. ఈ సినిమాలో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇక ఈ చిన్నది సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉ ంటుంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇన్ స్టాగ్రామ్ ద్వారా మెసేజ్ పంపారు, నేను హీరోయిన్ ఫ్రెండ్ రోల్ కోసం ఆడిషన్ అని వెళ్లాను. అయితే ఆడిషన్ తీసుకున్న తర్వాత హీరోయిన్ గానే తీసుకుంటున్నారు అని చెప్పారు. అయితే మొదటి రోజు షూటింగ్ జరిగే వరకు నేనే హీరోయిన్ అనేది నమ్మలేకపోయా.. అని తెలిపింది. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది.



# పిల్లలకు రక్షణగా ఉండాల్సిన బాధ్యత నాపై ఉంది: ప్రణీత

సినిమాలకు దూరంగా ఉంటున్న నటి ప్రణీత సుభాష్

పిల్లల బాధ్యతే ప్రధాన కారణమని వెల్లడి

పవన్ కళ్యాణ్ 'అత్తారింటికి దారేది' చిత్రంతో గుర్తింపు

సోషల్ మీడియాలో అభిమానులతో నిత్యం టచ్‌లో

తల్లిగా పిల్లల సంరక్షణకే తొలి ప్రాధాన్యత అంటున్న ప్రణీత

టాకీస్: తెలుగు సినీ పరిశ్రమలో కొన్ని చిత్రాలతో మెరిసి, ఆ తర్వాత తెరమరుగైన కథానాయికలు ఎందరో ఉన్నారు. అందం, అభినయం ఉన్నప్పటికీ అవకాశాలు తగ్గడం వలనో, వివాహానంతరం కుటుంబానికే పరిమితం కావడం వలనో కొందరు నటీమణులు వెండితెరకు దూరమవుతుంటారు. అలాంటి వారిలో ఒకప్పటి 'అత్తారింటికి దారేది' బ్యూటీ ప్రణీత సుభాష్ కూడా ఉన్నారు. ప్రస్తుతం ఆమె సినిమాల్లో ఎందుకు నటించడం లేదనే ప్రశ్నకు సోషల్ మీడియా వేదికగా స్పష్టతనిచ్చా రు. 'మీరు మళ్ళీ సినిమాల్లో ఎందుకు నటించ డం లేదు..?' అని ఓ నెటిజన్ ప్రశ్నించగా, ప్రణీత బదులిస్తూ, "నా పిల్లల వల్లే నేను ప్రస్తుతం సినిమాల్లో నటించడం లేదు. వారి బాధ్యత నాది. ఒక తల్లిగా వారికి ఎప్పుడూ అండగా ఉ ండాలి, వారిని జాగ్రత్తగా చూసుకోవాలి. అందుకే సినిమాలకు దూరంగా ఉంటున్నాను" అని తెలిపారు. పిల్లల పెంపకం, వారి సంరక్షణకే తన తొలి ప్రాధాన్యత అని, అందువల్లే ప్రస్తుతానికి నటనకు విరామం ఇచ్చానని ప్రణీత స్పష్టం చేశారు. కన్నడ చిత్రసీమ నుండి తెలుగు తెరకు పరిచయమైన ప్రణీత, ఇక్కడ దాదాపు ఎనిమిది సినిమాల్లో నటించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వచ్చిన 'అత్తారింటికి దారేది' చిత్రం ఆమె కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ సినిమాతో ప్రణీత తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. ఆ తర్వాత 'పాండవులు పాండవులు తుమ్మెద', 'రభస', 'డైనమైట్', 'బ్రహ్మోత్సవం', 'హలో గురు ప్రేమకోసమే' వంటి చిత్రాల్లో ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు, ద్వితీయ కథానాయికగా కూడా నటించారు. అయినప్పటికీ, 'అత్తారిం టికి దారేది' స్థాయిలో మరో విజయం ఆమె ఖాతాలో చేరలేదు. సినిమాల్లో అవకా శాలు తగ్గుముఖం పట్టిన సమయంలోనే ప్రణీత వివాహం చేసుకుని వ్యక్తిగత జీవితంలో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఇద్దరు పిల్లల తల్లిగా మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. సినిమాలకు దూరంగా ఉ ంటున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ప్రణీత చాలా చురుగ్గా ఉంటారు. తన కుటుంబానికి సంబంధించిన విశేషాలను, పిల్లల అల్లరిని ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ ఉంటారు.

## అందాలు ఆరబోస్తున్న కన్నప్ప హీరోయిన్



**టాకీస్:** టాలీవుడ్‌ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. కొత్త హీరోయిన్స్ చాలా మంది తన అందంతో నటనతో ఆకట్టుకుంటున్నారు. అలా టాలీవుడ్ కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటిస్తుంది. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలతో తన కెరీర్ ను ప్రారంభించింది. అందాల భామ ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆతర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్ గా మారింది.'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. మంచు విష్ణు తెరకెక్కిస్తున్న కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతి ముకుందన్మంచు. కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ చిన్నది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు చుస్తే నోరెళ్లబెట్టాల్సిందే.. ఈ ఫొటోలకు కుర్రాళ్ళు రొమాంటిక్ కామెంట్స్ చేస్తున్నారు.

## లండన్‌లో జాన్వీ అందాల విందు



**టాకీస్:** ఇండస్ట్రీలో కొత్త అందాలు ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొత్త కొత్త హీరోయిన్ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సినిమా సినిమాకు కొత్త హీరోయిన్స్ పరిచయం అవుతూ దూసుకుపోతున్నారు. ఇక చాలా మంది హీరోయిన్స్ కు అవకాశాలు చాలా చిత్ర విచిత్రంగా వస్తుంటాయి. కొంతమంది ఎంతో కష్టపడి అవకాశాలను అందుకుంటున్నారు. మరికొంతమందికి ఈ మధ్య సోషల్ మీడియా పుణ్యమా అని హీరోయిన్ అవకాశాలు అందుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ అలా వచ్చిన వారే.. అయితే ఇప్పుడు మనం చూస్తున్న హీరోయిన్ కూడా విచిత్రంగా హీరోయిన్ గా మారిపోయింది. హీరోయిన్ పాత్ర కోసం ఆడిషన్ కు వెళ్తే అనుకోకుండా హీరోయిన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ఇప్పటికే చాలా మంది హీరోయిన్ తెలుగులో రాణిస్తున్నారు వారిలో శివాని నాగరం ఒకరు. ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా. శివాని నాగరం నటనా జీవితాన్ని ఆడిషన్‌ల ద్వారా ప్రారంభించింది. ఈ అమ్మడి మొదటి సినిమా అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు (2024), ఈ చిత్రంలో సుహాస్ సరసన హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ఆమె లక్ష్మి అనే పాత్రలో కనిపించింది. ఈ సినిమాలో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇక ఈ చిన్నది సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇన్ స్టాగ్రామ్ ద్వారా మెసేజ్ పంపారు, నేను హీరోయిన్ ఫ్రెండ్ రోల్ కోసం ఆడిషన్ అని వెళ్లాను. అయితే ఆడిషన్ తీసుకున్న తర్వాత హీరోయిన్ గానే తీసుకుంటున్నారు అని చెప్పారు. అయితే మొదటి రోజు షూటింగ్ జరిగే వరకు నేనే హీరోయిన్ అనేది నమ్మలేకపోయా.. అని తెలిపింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.